క్లుప్తంగా

సోనుకు 'నేషనల్ స్టార్ ఎక్సలెన్స్'



అవార్డు అందజేస్తున్న భానుచందర్

ఆమనగల్లు: పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ సోను నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన వైఎంకే అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ కరాటే విభాగంలో అత్యంత ప్రతిభ చూపే వారికి నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డులు అందజేస్తోంది. ఈ ఏడాది కరాటే మాస్టర్ సోను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు కరాటే నేర్పించడంతో అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడలోని ఉజ్వల సరళాదేవి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, కరాటే మాస్టర్ భానుచందర్ ఈ అవార్డును సోనుకు అందజేశారు. ఈ అవార్డు తన భాద్యతను మరింత పెంచిందని కరాటే మాస్టర్ సోను అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: పట్టణానికి చెందిన గుమ్మల్ల సందీప్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఏఎంసీ డైరెక్టర్ రవీందర్ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనయ్య, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి ఆస్పత్రి వైద్యాధికారిగా శ్రీకాంత్



ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ లింగరాజు

ఆమనగల్లు: పట్టణంలోని హోమియోపతి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిగా పట్టణానికి చెందిన డాక్టర్ దొంతు శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హోమియోపతి విభాగం ఏడీ డాక్టర్ ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. ప్రస్తుతం ఆయన ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో రాజీవ్ బాల సురక్ష కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వైద్యాధికారిగా రెగ్యులరైజ్ చేశారు.

హాస్టల్ భవనం కూల్చివేత



ఆమనగల్లు: పట్టణంలో శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతిగృహ భవనాన్ని మంగళవారం కూల్చివేశారు. హాస్టల్‌లో విద్యార్థులు తగినంతగా లేకపోవడంతో ఎత్తివేశారు. దాదాపు పదేళ్లుగా భవనం నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరింది. అదేభవనంలో నూతనంగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఇటీవల ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పార్టీ నాయకులు కోరారు. దీంతో శిథిలావస్థకు చేరిన భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించి నూతన భవన నిర్మాణం కోసం పాత భవనాన్ని కూల్చివేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాన్ని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నేతృత్వంలో కూల్చివేశారు.

విద్యుత్‌లైన్ బాధితులకు పరిహారం పెంచాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: హైటెన్షన్ విద్యుత్ లైన్ బాధిత రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 765 కేవీ బీదర్-మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ మేరకు ఆయన బాధిత రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని కోరుతూ మంగళవారం కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారి జగదీశ్వర్‌రెడ్డికి రైతులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్, అన్మాస్‌పల్లి మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, అనిల్‌యాదవ్ ఉన్నారు.

ఆదర్శ నేత అచ్యుతానందన్



ఇబ్రహీంపట్నం: అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



తుర్కయంజాల్ చౌరస్తాలో..



మంచాల: నివాళి అర్పిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య తదితరులు

ఇబ్రహీంపట్నం: ఆదర్శ నేత అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు అన్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం సీపీఎం నేతలు పార్టీ వ్యవస్థాపక సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుగ్గరాములు మాట్లాడుతూ.. అచ్యుతానందన్ మరణం ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటు అన్నారు. 17 ఏళ్ల ప్రాయంలోనే ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ.. కేరళ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో తీవ్ర నిర్బంధం ఎదురైనా కమ్యూనిస్టు ఉద్యమాన్ని తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ జంగయ్య, పి. జగన్, నర్సింహ, ప్రభుదాసు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గణేశ్, కృష్ణ, యాదగిరి, రాఘవేందర్, దాసు, యాదయ్య, బాలరాజ్, మహేశ్, వంశీ పాల్గొన్నారు.

సీపీఎంకు తీరని లోటు

తుర్కయంజాల్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి సీపీఎంకు తీరని లోటు అని పార్టీ నాయకుడు జె.ఆశీర్వాదం అన్నారు. అచ్యుతానందన్ మృతికి సంతాపంగా మంగళవారం తుర్కయంజాల్‌లో ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శారద తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు

మంచాల: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనేత వీఎస్ అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అచ్యుతానందన్ ఎన్నో ప్రజా పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గోపాల్, జంగయ్య, లెనిన్, అశోక్, వినోద్, ఐలయ్య, బాలరాజ్, గాలయ్య, సత్తయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలే పాఠశాల అభివృద్ధికి గీటురాయి

- మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి
- టీపీఎస్‌లో ప్రాథమిక పాఠశాల భవన ప్రారంభోత్సవం

మంచాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్)లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. టీపీఎస్‌పై నమ్మకంతో పెద్ద ఎత్తున విద్యార్థులు అడ్మిషన్లు పొందారని.. ప్రభుత్వ సహకారంతో శాస్త్రీయతతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ఫలితాలే పాఠశాల అభివృద్ధికి గీటురాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ ఎల్లేశ్, హెచ్ఎం గిరిధర్ గౌడ్, మోహన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజాషా. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.డీ. జానీ పాష, జంగయ్య, రాజు, పారిజాత, సంధ్య, జ్యోతి, నాయకులు చంద్రయ్య, జంగయ్య, సురేశ్, రాము, రాజు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల బాధ్యత మాదే..

సియా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ అమ్జద్



చెక్కు అందజేస్తున్న సయ్యద్ అమ్జద్

మాడ్గుల: నిరుపేద విద్యార్థినికి సియా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ అమ్జద్ అండగా నిలిచారు. మండల కేంద్రనికి చెందిన ఎండీ సమీరా ఇంటర్ మొదటి పరీక్ష ఫలితాలల్లో 431 మార్కులు సాధించింది. పై చదువులకు కావాల్సిన ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న సియా ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. ఆమె ఉన్నత చదువుల బాధ్యత ఇక నుంచి తామే చూసుకుంటామని ఫౌండేషన్ నుంచి హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినికి రూ.50 వేల విలువైన చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్, మాజీ కౌన్సిలర్ మక్బూల్, షానేవాజ్ ఖాన్, ఫౌండేషన్ సభ్యులు ఇంతియాజ్‌ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, జహంగీర్, ఎజాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల సేవే పరమావధి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి



మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచాల: పేద విద్యార్థుల సేవే పరమావధిగా ముందుకు వెళ్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జనసందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కె. భిక్షపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తమ ఫౌండేషన్ తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో 47 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి భాషయ్య, క్యాంపు కోఆర్డినేటర్లు బాలరాజు, శ్రీనివాస్, హెచ్ఎంలు నారాయణరెడ్డి, రుబియానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజు



మంచాల: బీజేపీ మండల కమిటీని పార్టీ పూర్తి స్థాయిలో ప్రకటించింది ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కమిటీ వివరాలు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ ఆదేశాల మేరకు పార్టీ మండల ప్రధాన కార్యదర్శులుగా వెదిరె జగదీశ్వర్‌రెడ్డి, కారింగ్ రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా యాట రమేశ్ ముదిరాజ్, నర్ల కృష్ణయాదవ్, పోలగొని రాజేశ్వరి,దే వర నాయక్, కోశాధికారిగా గంట నర్సింహారెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారని చెప్పారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్టీయూ పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. సంఘం మండల అధ్యక్షుడు పి.రమేశ్ అధ్యక్షతన మంగళవారం జెడ్పీహెచ్ఎస్(బాలికల)లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించామని.. ఫలితంగా జెడ్పీజీఎఫ్‌కు సంబంధించిన పెండింగ్ బడ్జెట్ విడుదల కానుందన్నారు. సీపీఎస్ రద్దు పీఆర్టీయూ బాధ్యతగా తీసుకుంటుందన్నారు. అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేస్తున్న ఏకైక సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, జమీర్, మల్లేశ్, రాజు, మహేశ్, ఆనంద్, సుప్రియ, శోభ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి కవిత్వంతో యువతలో చైతన్యం

ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక

ఇబ్రహీంపట్నం: దాశరథి కవిత్వం యువతను చైతన్యమార్గంలో నడిపించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, విశ్రాంతి ఆచార్యులు డాక్టర్ చందోజీరావు అన్నారు. ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం దాశరథి కవితా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక దాశరథి కవిత్వమన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ వ్యవహరించగా అధ్యాపకులు నరేందర్‌రెడ్డి, రమేష్, హృదయరాజు, రవికుమార్, వీరారెడ్డి, డీవీ రావు, శ్రీకృష్ణ, మాధవి, నీలిమ విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకరించండి

ఉదయ్‌గార్డెన్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కవాడిపల్లిలో ఉన్న ఉదయ్‌గార్డెన్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కవిత, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్‌గౌడ్, కార్యదర్శిగా మల్లిక్‌రావు, కోశాధికారిగా ఆర్.భాస్కర్ యాదవ్, సహ కోశాధికారిగా కె.తిరుమల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా బి.సురేందర్‌రెడ్డి, పలువురిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఏర్పాటును పురస్కరించుకుని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డిని కాలనీ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించారు.

జీహెచ్ఎంసీలో విలీనం వద్దు

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దంటూ బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే ఇంటి పన్నులు, నల్లాబిల్లులు చెల్లించక ఇబ్బందిపడుతున్నామని, ఇళ్ల నిర్మాణ అనుమతులు తీసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే సామాన్యులు తీవ్రంగా ఇబ్బంది పడుతాని వివరించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ పల్లె శ్రీకాంత్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు .

బాలింతలకు కేసీఆర్ కిట్



కేసీఆర్ కిట్ అందజేస్తున్న భరత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 'గిఫ్ట్ ఎ స్మైల్'లో భాగంగా బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు భరత్‌రెడ్డి తుర్కగూడలో బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలో బాలింతలకు కేసీఆర్ కిట్లతో పాటు ఆర్థికసాయం అందేదని గుర్తు చేశారు. ఈ నెల 24న కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించి మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జలేందర్, పవన్, విక్రాంత్‌రెడ్డి, విక్రమ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎంకు సన్మానం



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్పతో సుధాకర్, భిక్షపతి తదితరులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్పను మంగళవారం హెచ్ఎం సుధాకర్, సంఘ సేవకుడు భిక్షపతి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలిమినేడు విద్యార్థులకు పాఠశాల, కళాశాల వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని వారికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరిన వెంటనే డీఎం స్పందించి బస్సు సౌకర్యం కల్పించారన్నారు. ఎలిమినేడు నుంచి మాదాపూర్‌కు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందని బస్సు సౌకర్యాన్ని మాదాపూర్ వరకు పొడిగించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలశౌరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి



చెత్త వేసే ప్రాంతంలో శుభ్రం చేసిన కార్మికులు

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ హెచ్చరించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించనున్నామని ఆయన పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామన్నారు. చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రం చేయించి మొక్కలను నాటడంతో పాటు, ముగ్గులను వేయించారు. భువన్ సర్వేలో భాగంగా మిక్స్‌డ్ కమర్షియల్ భవనాలను గుర్తించి ఆస్తిపన్ను మదింపు చేపట్టనున్నామన్నారు.